

మంత్రి పర్యటన వాయిదా

బషీరాబాద్, జూలై 17: నేడు(గురువారం) బషీరాబాద్‌లో జరిగే మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటన వాయిదా పడినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. రుణ మాఫీ సంబరాలను ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో జరుపుకోవాలని సీఎం ఆదేశంతో మంత్రి పర్యటన వాయిదా పడినట్లు సమాచారం. త్వరలో పర్యటనకు సంబంధించి వివరాలు వెల్లడిస్తామని ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి తెలిపారు.



కీసరలో పీర్ల ఊరేగింపు



ఎల్లకన్నెల్లో బిందెలతో నీళ్లు పోసి పీర్లకు మొక్కుతున్న మహిళలు

దట్టీలు కట్టి.. దండాలు పెట్టి..

» జిల్లాల్లో భక్తి శ్రద్ధలతో పీర్ల పండుగ

త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం బుధవారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పది రోజులుగా చావిడిలలోని(కొట్టాలు) పీర్లను భక్తులు దర్శించుకున్నారు. పీర్లను గ్రామాల్లో ఊరేగించగా కులమతాలకతీతంగా ప్రజలు దట్టీలు కట్టి, ఊదుబెల్లం, కొబ్బరి చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. డప్పుచప్పుళ్ల నడుమ గ్రామస్తులు అలవా చుట్టూ ఆడారు. ధర్మం కోసం కర్బలా యుద్ధంలో ప్రాణాలర్పించిన ఇమామ్ హుస్సేన్, హస్సన్‌లను స్మరించుకుంటూ కీసరలో షియాలు మాతం నిర్వహించారు. - కీసర/తాండూరు రూరల్



రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. పంటల సాగుకోసం తీసుకున్న రూ. రెండు లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దీనికనుగుణంగా నేడు లక్ష రూపాయల లోపు తీసుకున్న రుణాలను మాఫీ చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆ డబ్బులు రైతుల అకౌంట్లలో జమ కానున్నాయి. మొదటి విడతగా గురువారం రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేయడం వల్ల జిల్లాలో 46,633 వేల మంది రైతులకు రుణ విముక్తి కలగనుంది. మొత్తంగా ఈ విడతలో రూ. జిల్లాలోని రైతులకు రూ.రూ.256.26 కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీకి నేడు నిధులు విడుదల చేస్తామనడంతో హర్షాతిరేకాలు వ్యక్తం కాగా, సంబురాలు జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రైతు వేదికలను ముస్తాబు చేశారు.

రైతు మోములో ఆనందం!

నేడు మొదటి విడతగా రుణమాఫీ

- జిల్లాలో 46,633 మంది రైతులకు రూ.256.26 కోట్లు
- నేడు అన్నదాతల ఖాతాల్లో జమ కానున్న నిధులు
- ఈనెలాఖరులోగా రూ.1.50లక్షల లోపు...
- ఆగస్టు మొదటి వారంలో రూ.2 లక్షల్లోపు రుణమాఫీకి చర్యలు
- సంబరాలకు కాంగ్రెస్ సన్నద్ధం

వికారాబాద్/మేడ్చల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) :రైతు రుణమాఫీకి వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈనెల 18వ తేదీ, గురువారం సాయంత్రంలోగా రూ. లక్షలోపు పంట రుణాలు తీసుకున్న అన్నదాతలకు రుణమాఫీ వర్తింపజేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వికారాబాద్ జిల్లాలో 2.95 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో రూ.1.60 లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో రూ. లక్ష లోపు పంట రుణాలు ఉన్న 46,633 మంది రైతులకు గురువారం సాయంత్రం రూ.256.26 కోట్లు నగదు బదిలీ చేయనున్నారు. ప్రభుత్వం రైతు రుణమాఫీకి అర్హులను గుర్తించేందుకు జారీ చేసిన మార్గదర్శకాల్లో పొందుపరిచిన నిబంధనలతో రూ. 2 లక్షల రుణమాఫీకి ఎంత మంది అర్హులు కానున్నారనేది ఇంకా స్పష్టత రాలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంత మందికి రుణమాఫీ అమలవుతుందనేది అన్నదాతల్లో ఉత్కంఠ నెలకొంది.

మూడు విడతల్లో రుణమాఫీ...

ప్రభుత్వం విడతల వారీగా రుణమాఫీ అమలు చేయాలని నిర్ణయించింది. ఆగస్టు 15వ తేదీలోగా మూడు విడతల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. తొలి విడతలో భాగంగా గురువారం రూ. లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింపజేస్తారు. ఆ తరువాత ఈనెలాఖరులోగా రెండో విడత కింద రూ.1.50 లక్షల వరకు, ఆగస్టు 14వ తేదీలోగా రూ. 2 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయనున్నట్లు చెబుతున్నారు. ఆగస్టు 15వ తేదీ లోగా రూ. 2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. రైతు రుణమాఫీ పట్టాదారు పాసు పుస్తకం ప్రకారమే చేస్తామని, ఒక కుటుంబానికి రూ. 2 లక్షల రుణమాఫీ వర్తించేందుకు రేషన్ కార్డును ఆధారంగా పరిగణనలోకి తీసుకోనున్నట్లు ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది.

ఆ రైతుల పరిస్థితి ఏంటీ ?

కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష పంట రుణ మాఫీలో లబ్ధి పొందకుండా మిగిలిపోయిన కొందరు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ. 2లక్షల రుణమాఫీ వర్తించే పరిస్థితులు కనిపించడం లేదు. 2014, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2018, డిసెంబరు 11వ తేదీ వరకు వికారాబాద్ జిల్లాలో స్వల్పకాలిక రుణాలు తీసుకున్న రైతుల్లో లక్ష రూపాయల పంట రుణ మాఫీకి 1,59,617 మంది రైతుల అర్హులుగా గుర్తించగా. కేసీఆర్ ప్రభుత్వం వారిలో 1,06,303 మంది రైతులకు రూ.631.88 కోట్లు పంట రుణమాఫీ వర్తింపజేసింది. మిగిలిన 90,386 మంది రైతులు రూ.లక్షలోపు పంట రుణమాఫీకి నోచుకోలేదు. రూ.2 లక్షల పంట రుణ మాఫీ 2018, డిసెంబరు 12వతేదీ నుంచి 2023, డిసెంబరు 9వ తేదీ మధ్య కాలంలో తీసుకున్న పంట రుణాలకు మాత్రమే వర్తిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణ మాఫీ వర్తింపు ప్రశ్నార్థకంగా మారింది.జిల్లాలో 2,62,065 మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతుండగా, వారిలో 1,13,649 మంది రైతు కుటుంబాలు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాయి.

తొలి విడత రైతు రుణమాఫీ వివరాలు

నియోజకవర్గం	రైతుల సంఖ్య	మాఫీ మొత్తం(రూ. కోట్లలో)
వికారాబాద్	11,425	61,88,80,333
తాండూరు	9,656	55,93,54,603
పరిగి	12,996	69,97,63,984
కొడంగల్	9,604	53,95,20,855
చేవెళ్ల (నవాబ్‌పేట్)	2,952	14,51,10,747
మొత్తం	46,633	256,26,30,522



మేడ్చల్‌లో సంబరాలకు ముస్తాబు చేసిన రైతు వేదిక భవనం

సంబరాలకు సిద్ధం

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు దశలవారీగా రుణమాఫీ చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధమైంది. తొలి విడత నేడు రూ.లక్షలోపు రైతు రుణాలను మాఫీ చేయనుంది. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ, బ్యాంకర్లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వ్యవసాయాధికారులు సంబరాలకు ఏర్పాట్లు చేశారు. ఈ రోజు సాయంత్రం 4గంటలకు రైతువేదికల్లో రైతులతో కలిసి సంబరాలు జరిపేందుకు ముస్తాబు చేశారు. జిల్లాలోని రైతు వేదికలకు మామిడి కొమ్మలు, తోరణాలతో అందంగా ముస్తాబు చేస్తున్నారు. రైతులు పెద్దఎత్తున రైతు వేదికలకు రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్‌నేతలు కూడా రైతులతో కలిసి సంబరాలు జరుపుకునేందుకు పిలుపు నిచ్చారు.

మండలాల వారీగా..

జిల్లాలో బంట్వారం మండలంలో 924 మంది రైతులకు రూ.5,67,16,082, ధారూరు మండలంలో 2766 మంది రైతులకు రూ.14,88,43,105, మర్పల్లి మండలంలో 3108 మంది రైతులకు రూ.16,94,03,334, మోమిన్‌పేట్ మండలంలో 2100 మంది రైతులకు 11,55,98,774, వికారాబాద్ మండలంలో 2527 మంది రైతులకు రూ.12,83,19,038 రుణమాఫీ వర్తించనుంది. బషీరాబాద్ మండలంలో 2109 మంది రైతులకు 12,09,36,791, కోట్‌పల్లి మండలంలో 1102 మంది రైతులకు రూ.6,66,79,701, పెద్దేముల్ మండలంలో 1910 మంది రైతులకు రూ.11,19,18,949, తాండూరు మండలంలో 2017 మంది రైతులకు రూ.11,97,81,364, యాలాల మండలంలో 2464 మంది రైతులకు రూ.14,00,37,798 రుణమాఫీ చేయనున్నారు. చౌడాపూర్ మండలంలో 2144 మంది రైతులకు రూ.11,67,06,448, దోమ మండలంలో 3032 మండలంలో రూ.16,38,15,702, కులకచర్ల మండలంలో 2402 మండలంలో రూ.13,26,67,201, పరిగి మండలంలో 2981 మంది రైతులకు రూ.16,54,72,234, పూడూరు మండలంలో 2437 మంది రైతులకు రూ.12,11,02,399 రుణమాఫీ వర్తించనుంది. బొంరాస్‌పేట మండలంలో 2954 మంది రైతులకు రూ.17,18,78,705, దౌల్తాబాద్ మండలంలో 3682 మంది రైతులకు రూ.20,10,17,798, కొడంగల్ మండలంలో 2968 మంది రైతులకు రూ.16,66,24,352, నవాబ్‌పేట మండలంలో 2952 మంది రైతులకు రూ.14,51,10,747 రుణమాఫీ కానుంది.



స్వామివారి పల్లకి సేవతో పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

బషీరాబాద్, జూలై 17: తొలి ఏకాదశి వేడులకను వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను పూలు, విద్యుత్ లైట్లతో శోభాయామానంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ప్రధాన ఆలయాలు సందడిగా మారాయి. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి సాయంత్రం ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. బషీరాబాద్ హనుమాన్ మందిర్ నుంచి భజన మండలి ఆధ్వర్యంలో ఆలయ పూజారి జయరాంచారి నేతృత్వంలో స్వామివారి పల్లకీ సేవ కర్ణాటక రాష్ట్రంలోని హల్కోడ గ్రామం పాండురంగ విఠల దేవస్థానం వరకు కొనసాగింది. కులకచర్ల మండలంలోని కామునిపల్లి గ్రామం నుంచి దోమ మండలం మైలారం శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ప్రజలు పెద్దఎత్తున పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

చినుకు పడితే చిత్తడే..



దోమ, జూలై 17: దోమ మండలంలోని లింగన్‌పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు వర్షం కురియడంతో చిత్తడిగా మారింది. మండల కేంద్రం నుంచి ఆ గ్రామానికి చేరుకోవాలంటే మూడు కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. వానకు రోడ్డు అధ్వానంగా మారడంతో అత్యవసర సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

లేఅవుట్ భూమికి రైతుబంధు!

'ధరణి'లో అక్రమాల పర్వం


» మూడేళ్లలో రూ.1,61,375 స్వాహా » రికవరీ చేయాలంటున్న రైతులు

శామీర్‌పేట, జూలై 17: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 'ధరణి' అక్రమాల పర్వంలో మరో ఉదంతం వెలుగుచూసింది. మొన్న ఘట్‌కేసర్‌లో ఓ వ్యక్తి లేఅవుట్ భూమికి దాదాపు రూ.17 లక్షల రైతుబంధు సొమ్ము పొందినట్టు తేలగా.. తాజాగా శామీర్‌పేటలో కూడా అలాంటి వ్యవహారం బయటపడింది. లేఅవుట్ చేసి ప్లాట్లుగా విభజించిన భూమికి అధికారుల అండతో యజమానులు ధరణి పాస్ బుక్కులు, ఆపై రైతుబంధు కూడా దర్జాగా పొందారు. ఇలా 2021 నుంచి 2024 వరకు మూడేళ్ల పాటు రూ.1,61,375 రైతుబంధు సొమ్ము స్వాహా చేశారు. కొందరు స్థానిక రైతులు ఇచ్చిన సమాచారంతో విచారణ జరపగా ఈ అక్రమ తంతు బయటపడింది. శామీర్‌పేట పరిధిలో ప్రజయ్ ఇంజనీర్స్ సిండికేట్ (సెలబ్రిటీ రిసార్ట్సు) పక్కన సర్వే నెంబర్లు-1211, 1213/ఎ, 1214, 1215, 1216లలో 11.26 ఎకరాల వ్యవసాయ పట్టా భూమిని 2003లో జయఈశ్వర్‌రెడ్డి, మాహేశ్‌రెడ్డి, రాజవెంకట్‌రెడ్డి కొనుగోలు చేశారు. తర్వాత గ్రామ పంచాయతీ నుంచి లేఅవుట్ అనుమతి పొంది ఈ భూమిని ప్లాట్లుగా చేశారు. దీనికి 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొందరు ఉన్నతాధికారులు నిబంధనలకు నీళ్లొదిలి భూ యజమానులకు ధరణి పట్టాదారు పాస్ బుక్‌లు జారీ చేసి ఇచ్చారని మండల రైతులు ఆరోపిస్తున్నారు. భూ యజమానులు అక్రమంగా పొందిన రైతుబంధు సొమ్ము రూ.1,61,375ను వసూలు చేయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమ పాస్‌బుక్‌లను కూడా రద్దు చేసి, అవినీతి అవకతవకలకు పాల్పడిన రెవెన్యూ అధికారులను, భూ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





శామీర్‌పేటలో రైతుబంధు ఇస్తున్నది ఈ లేఅవుట్ చేసిన భూమికే



శామీర్‌పేట గ్రామ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన జీపీ లేవుట్ ప్లాట్ల మ్యాప్

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

ఈ 11.26 ఎకరాల పట్టా భూమిని యజమానులు గతంలో లేఅవుట్ ప్లాట్లు చేసినట్లు, తరువాత ధరణి పట్టదారు పాస్‌బుక్‌లు పొందినట్లు మా దృష్టికి వచ్చింది. నిబంధనల ప్రకారం లేఅవుట్ చేసిన భూమికి పట్టదారుపాసుబుక్‌లు ఇవ్వకూడదు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

-యాదగిరిరెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్

సైకిళ్లపై మహిళా కానిస్టేబుళ్ల పెట్రోలింగ్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 17: మండలంలో బుధవారం మహిళా కానిస్టేబుళ్లు సైకిళ్లపై పెట్రోలింగ్ నిర్వహించారు. ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ, దత్తాత్రేయకాలనీల్లో పెట్రోలింగ్ నిర్వహించి యువకులు, మహిళలతో మాట్లాడారు. అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, అనుమానంగా కలిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న లేడీ కానిస్టేబుళ్లు

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్

పరిగి, జూలై 17: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మారుతీకిరణ్ అన్నారు. బుధవారం పరిగిలోని గ్రీన్‌పార్కు హోటల్‌లో జరిగిన జిల్లా పార్టీ పదాధికారుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజా పోరాటాలతో పార్టీని బలోపేతం చేద్దామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ పట్టును సాధించేలా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్రప్రధానకార్యదర్శి ఈశ్వరప్ప, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాంచందర్, ఆంజనేయులు, వెంకటయ్యగౌడ్, రాముయాదవ్, కేశవులు, హరికృష్ణ పాల్గొన్నారు.

బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి

కులకచర్ల, జూలై 17: బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు అన్నారు. బుధవారం కులకచర్లలో ఓ కార్యక్రమంలో పాల్గొని విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అండగా ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్, బీసీ సంఘం నాయకులు కుమ్మరిస్వామి, చంద్రలింగం, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకల్లో గొడవ

» కత్తులు, కర్రలతో పరస్పర దాడి » నలుగురికి గాయాలు

» 11 మందిపై కేసు నమోదు » జలాల్‌పూర్‌లో ఘటన

జహీరాబాద్‌, జూలై 17: పాత కక్షలతో రెండు కుటుంబాల మధ్య తలెత్తిన గొడవతో కత్తులు, కర్రలతో పరస్పరం దాడులకు దిగారు. దీంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన జహీరాబాద్‌ మండలం జలాల్‌పూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... కుర్వపద్మమ్మ, లోకిరెడ్డి నగేష్‌ కుటుంబీల మధ్య పెళ్లికి సంబంధించిన అమ్మాయి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం మొహర్రం వేడుకల్లో భాగంగా అస్సైదుల ఆడుతుండగా ఇరు కుటుంబాల్లోని ఇద్దరి మధ్య అర్ధరాత్రి గొడవ జరిగింది. రెండు కుటుంబాలకు చెందిన వారు అక్కడికి చేరుకున్నారు. దేవప్ప, సిద్దప్ప, నర్సింహులు, నగేష్‌ ఒక వర్గంగా, దేవప్ప, వెంకటప్ప, నర్సింహులు, వెంకటప్ప, సిద్దప్ప, రాజు, బుగ్గప్ప మరో వర్గంగా కత్తులు, కర్రలతో దాడులు చేసుకున్నారు. దీంతో గ్రామస్తులు భయం దోళనతో ఇళ్లలోకి పరుగు తీశారు. దాడుల్లో నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జహీరాబాద్‌ ఎస్‌ఐ రమేష్‌కుమార్‌, సిబ్బందితో గ్రామానికి చేరుకుని అందరిని చెదరగొట్టారు. గాయాలైన నలుగురిని తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ దాడికి సంబంధించి పద్మమ్మ, నగేష్‌ పరస్పరం ఫిర్యాదు చేయగా 11 మందిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



దాడిలో తలకు గాయాలైన బాధితుడు

‘సీత్లా’ విగ్రహాల పునఃప్రతిష్ఠ

» విగ్రహాలను తొలగించిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్‌

పటాన్‌చెరు, జూలై 17: పటాన్‌చెరు మున్సిపాలిటీ పరిధి ఎస్‌ఎస్‌నగర్‌ బ్యూటీ నెస్ట్‌ వెంచర్‌లో సీత్లా పండుగ సందర్భంగా ఏర్పాటు చేసుకున్న విగ్రహాలను తొలగించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని గోర్‌ వేల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో బంజారాలు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. బంజారా సంఘం నాయకులు లింగ్యానాయక్‌, రాములు మాట్లాడుతూ.. వర్షాలు కురవాలని, ప్రజలు, జీవులు సుభిక్షంగా ఉండాలని భక్తితో పూజలు చేస్తూ తాము సీత్లా పండుగ నిర్వహిస్తామన్నారు. కమిషనర్‌ సవనల మేరకే పండుగ నిర్వహించుకున్నా కౌన్సిలర్‌ రమాదేవి కొందరితో కుమ్మక్కై తమ కుల దేవతల విగ్రహాలను తొలగించడం ఎంత వరకు కరెక్ట్‌ అని ప్రశ్నించారు. అక్రమంగా విగ్రహాలను తొలగించిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్‌ చేశారు. బంజారాలకు కౌన్సిలర్‌ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కాగా సీత్లా విగ్రహాల తొలగింపులో తన సంబంధం లేదని కౌన్సిలర్‌ కె.రమాదేవి అన్నారు. ఆమె మాట్లాడుతూ బంజారా సోదరులు నాలుగేళ్లుగా తనతో స్నేహపూర్వకంగా ఉన్నారన్నారు. కొందరు గిట్టని వారు తనను రాజకీయంగా దెబ్బ కొట్టాలని బంజారాలను తనపైకి ఉసిగొల్పి దర్నాలకు పాల్పడుతున్నారని, ఈ మటనపై పోలీసులే చూసుకుంటారన్నారు. ఓ మహిళా కౌన్సిలర్‌ను మానసిక క్షోభకు గురిచేయడం సరికాదన్నారు.



ఆందోళన చేస్తున్న బంజారాలు

రైతులకిచ్చిన హామీ మేరకు

రుణాల మాఫీకి శ్రీకారం

» విలేకరులతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 17: రైతులకిచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్‌ సర్కార్‌ పంట రుణాలు మాఫీ చేస్తుందని, ఇది చారిత్రాత్మకమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీల్లో ఇప్పటికే ఉచిత బస్‌ ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు లాంటివి అమలవుతున్నాయని, ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరి లక్ష్మీనృసింహస్వామి సాక్షిగా చేసిన ప్రకటనకు కట్టుబడి రుణాల మాఫీకి పూనుకుందంటూ గుర్తుచేశారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజా భవన్‌)లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పదేళ్ల కాలంలోకూడా లక్ష రూపాయల రుణమాఫీ పూర్తి చేయలేకపోయిందని, కాంగ్రెస్‌ ప్రభుత్వం రూ.31వేల కోట్లు రుణమాఫీకి ముందుకు రావడంతో ప్రతిపక్షాల నోళ్లు మూతబడ్డాయన్నారు. ఇప్పటికే అన్ని బ్యాంకులు, పీఏసీఎస్‌లో పేరుకుపోయిన రుణాల వివరాలను ప్రభుత్వం సేకరించిందని గుర్తుచేశారు. రెండోసారి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం విడతల వారీగా రుణమాఫీకి పూనుకున్నా.. 12 లక్షల మంది రైతుల రుణాలు ఎగ్గొట్టడంతో తీవ్ర ఇబ్బందుల పడ్డ విషయం తెలిసిందేనన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు ఒక వైపు వడ్డీ చెల్లిస్తూనే.. సంక్షేమ పథకాలను ముందుకు తీసుకుపోతున్నామని అన్నారు.



తహసీల్దార్‌ కార్యాలయం పనులు పూర్తి చేస్తాం

ఇబ్రహీంపట్నంలో అసంపూర్తిగా నిలిచిపోయిన తహసీల్దార్‌ కార్యాలయం పనులు వెంటనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో చర్చించామని, అవసరమైన నిధులు విడుదల చేయించి పనులు చేపడతామన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని కూడా తొందర్లోనే అందుబాటులోకి తెస్తామన్నారు. ఏళ్ల తరబడిగా పేరుకుపోయిన ధరణి సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించే పనిలో ఉందని తెలిపారు.

మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌కు కాంగ్రెస్‌ నేతల సన్మానం

మేడ్చల్‌ టౌన్‌, జూలై 17: రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నేరెళ్ల శారదను మేడ్చల్‌ జిల్లా కాంగ్రెస్‌ నాయకులు బుధవారం సన్మానించారు. నగరంలో చైర్‌పర్సన్‌ను ఇంటికి వెళ్లి కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాకప్పి సన్మానించారు.





అలిజా ఫాతిమా తల్లిదండ్రులకు రూ.50వేల చెక్కు అందిస్తున్న మాజీ ఎంపీపీ బాల్‌రాజ్‌

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

చేవెళ్ల, జూలై 17 : బ్రెయిన్‌ ట్యూమర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న బాలికకు వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు ముందుకొచ్చారు. చేవెళ్ల మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్‌, గుడిమల్కాపూర్‌ మార్కెట్‌ కమిటీ మాజీ డైరెక్టర్‌ ఎం.యాదగిరిలు బ్రెయిన్‌ ట్యూమర్‌తో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రెండున్నరేళ్ల బాలిక తల్లిదండ్రులకు వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం రూ.50వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో బాలిక తండ్రి మహ్మద్‌ ఆరిఫ్‌, మైనార్టీ నాయకులు ఎండీ ఖలీల్‌, మహ్మద్‌ ఖలీద్‌, పలువురు నాయకులు ఉన్నారు.



దేవుని ఎర్రవల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆట సామగ్రి

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

చేవెళ్ల, జూలై 17 : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు చాలా ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. చేవెళ్ల మండల పరిధి దేవుని ఎర్రవల్లి గ్రామంలోని అంగన్‌వాడీ పిల్లలతో పాటు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆడుకునేందుకుగాను క్రీడా సామగ్రిని సొంత నిధులు రూ.లక్షా 20 వేలతో ఏర్పాటు చేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని చెప్పారు. కాగా, క్రీడా సామగ్రి అందజేయడంతో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ అధికారులు, గ్రామస్తులు, పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్‌ సామా మాణిక్యరెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, నాయకులు బక్కయ్య, మాణిక్యంగౌడ్‌, జంగయ్యగౌడ్‌, రవీందర్‌, వెంకటయ్య, శ్రీనివాస్‌, మల్లేష్‌, అరుణ్‌కుమార్‌, టీచర్లు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఊతమివ్వండి

» సీఎంకు ఎమ్మెల్యే బుయ్యని విజ్ఞప్తి

» కొడంగల్‌ తరహాలోనే తాండూరుకూ నిధులిస్తామని సీఎం అభయం!

తాండూరు, జూలై 17: హైదరాబాద్‌-సికింద్రాబాద్‌ జంట నగరాల వలె తాండూరు, కొడంగల్‌ నియోజకవర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌, తాండూరు పక్కపక్కనున్నాయి. ఈ ప్రాంత గ్రామాల ప్రజలు ఏ అవసరానికైనా తాండూరుకు వెళ్తుంటారు. విద్య, వైద్య, వ్యాపారం వంటి వాటికి తాండూరుపైనే ఎక్కువగా ఆధారపడుతారు. తాండూరు ప్రాంతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. కాలక్రమేనా అభివృద్ధి చెందుతున్నా ఇంకా చాల అంశాల్లో వెనుకబడి ఉంది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రెండు నియోజకవర్గాలకు అనుసంధానమైన అంశాలపై నివేదికల్లివ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ విషయంలో వివిధ శాఖల అధికారులు రిపోర్టుల తయారీలో నిమగ్నమయ్యారు. రెండు నియోజకవర్గాలకు తాగునీరు, విద్యుత్‌, వైద్యం, విద్య పరిశ్రమలు, సాంకేతిక విద్య తదితర అంశాల్లో సారూప్యతను గుర్తించనున్నారు.

విద్యుత్‌ విషయంలో..

కొడంగల్‌ నుంచి ఎర్రన్‌పల్లి శివారు వరకు లైన్‌ పనులు చేపట్టారు. అక్కడ మెడికల్‌ కళాశాల, ఇతర పనులకు విద్యుత్‌ అవసరాన్ని గుర్తించి లైన్లను ఏర్పాటు చేశారు. తాగునీటి, పట్టణ అవసరాలకు కొడంగల్‌ నుంచి కరెంట్‌ లైన్లను తాండూరు వరకు పొడిగిస్తే విద్యుత్‌ సమస్య తీరుతుందని ఎమ్మెల్యే సూచనతో పనులు కోసం సీఎం అధికారులకు ఆదేశించారు. వైరింగ్‌ ఎంత అవసరం, పోల్స్‌ అనుసంధానం వంటి అంశాలను లెక్కిస్తున్నారు. తాండూరులో కరెంటు సమస్య పరిష్కారానికి జహీరాబాద్‌ మండలం నవల్గ వద్ద 133కేవీ సబ్‌స్టేషన్‌ ఏర్పాటు చేయనున్నారు.

నీటి అవసరాల కోసం బృహత్తర ప్రణాళిక

తాండూరు కాగ్నా నది ఆధారంగా కొడంగల్‌ ప్రాంతానికి నీరు తీసుకెళ్లడంతో పాటు యాలాల మండల గ్రామాలకు నీరు అందించే అంశాన్నీ పరిశీలిస్తున్నారు. కొడంగల్‌ ప్రాంతంలోని మున్సిపాలిటీ, గ్రామాలతో పాటు యాలాల మండలం 8 గ్రామాలకు తాగునీరందించేలా ప్రణాళిక తయారు చేస్తున్నారు. అదనంగా మరిన్ని గ్రామాలకు ఉపయోగపడేలా చూస్తున్నారు. పైప్‌లైన్లను



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి అభయమిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్‌)

ఎంఎల్‌డీ నుంచి 20ఎంఎల్‌డీ సామర్థ్యానికి పెంచాలని నిర్ణయించారు.

వైద్యులను నియమించి ఉత్తమ సేవలు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ఖాళీలను భర్తీచేయడంతో పాటు నిధులివ్వాలని ఎమ్మెల్యే కోరారు. మైనింగ్‌లో కర్ణాటక తరహాలో రాయల్టీని తాండూరు ప్రాంతంలోనే వెచ్చించాలని విన్నవించారు. రెండు నియోజకవర్గాలను కలిపేలా లింక్‌ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేశారు. గోట్లుగకలాన్‌ వయా పటిమదిపల్లి-రుద్రారం, మర్పల్లి-రుద్రారం, దేవనూర్‌-కొత్తూర్‌, గోరిపల్లి వయా వడిచర్ల ఎన్నెపల్లి, బాగాయిపల్లి వయా మందిపురం-కొత్తూర్‌ తదితర లింక్‌ రోడ్లను గుర్తించారు. కడా ప్రాజెక్టు కింద ఈ రోడ్ల అభివృద్ధికి నిధులివ్వాలని సీఎం వద్ద ఎమ్మెల్యే ప్రతిపాదించారు.

బీఆర్‌ఎస్‌ నాయకుల ముందస్తు అరెస్ట్‌

» మంత్రుల పర్యటన నేపథ్యంలో అదుపులోకి..

» కల్వాల నుంచి తలకొండపల్లి పోలీసుస్టేషన్‌కు తరలింపు

» తలకొండపల్లి ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో

తలకొండపల్లి/కల్వకుర్తి, జూలై 17: కల్వకుర్తి మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిల రాక నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మంత్రుల పర్యటనకు ఎలాంటి ఆటంకం కలుగకుండా బుధవారం ఉదయం మాజీ జడ్పీటీసీ, బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు జర్పుల దశరథ్‌ నాయక్‌, మాజీ వైస్‌ ఎంపీపీ జానుపల్లి ఆనంద్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు హరిచందన్‌నాయక్‌, పాండు నాయక్‌, హెచ్‌ఆర్‌ మహేశ్‌, అంజిలను పోలీసులు ముందస్తు అరెస్ట్‌ చేసి తలకొండపల్లి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి మండలాల బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తలకొండపల్లి మండల కేంద్రానికి చేరుకున్నారు. దశరథ్‌ నాయక్‌ను ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్‌ నాయకులు పోలీసులతో అరెస్ట్‌ చేయించారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు తలకొండపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కల్వకుర్తి మాజీ చైర్మన్‌ ఎడ్మ సత్యం, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు సీఎల్‌ శ్రీనివాస్‌యాదవ్‌, డీసీసీబీ డైరెక్టర్‌ గంప వెంకటేశ్‌, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షులు కరెంట్‌, పత్యానాయక్‌, పరమేశ్‌, నాయకులు జోతయ్య, జోసు వెంకటయ్య, గోపాల్‌, శ్రీనివాస్‌ రెడ్డి, వీరయ్య తదితరులున్నారు.



తలకొండపల్లి : పోలీస్‌స్టేషన్‌ ఎదుట నిరసనలో దశరథ్‌నాయక్‌, శ్రీనివాస్‌ యాదవ్‌, సత్యం, నాయకులు

బీఆర్‌ఎస్‌ది కుట్ర రాజకీయాలు : ఎమ్మెల్యే కసిరెడ్డి

కల్వకుర్తి : పంట రుణాల మాఫీ విషయంలో రైతులను, ఉద్యోగాల భర్తీలో నిరుద్యోగులను బీఆర్‌ఎస్‌ నాయకులు తప్పుదోవ పట్టిస్తూ కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతులు, నిరుద్యోగులు విపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కల్వకుర్తి మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల ప్రారంభం అనంతరం జరిగిన సమావేశంలో నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజావిశ్వాసం కోల్పోయిన బీఆర్‌ఎస్‌ నాయకులు ఉనికి కోసం కుట్రలు సాగిస్తున్నారని మండిపడ్డారు. రైతుల రూ.2లక్షల పంట రుణాలను ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మాఫీ చేస్తుండడంతో జీర్ణించుకోలేని బీఆర్‌ఎస్‌ నేతలు వారిని తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. రేషన్‌ కార్డుతో సంబంధం లేకుండా పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా రుణాలు మాఫీ చేస్తుందని చెప్పారు. బీఆర్‌ఎస్‌ పదేళ్ల పాలనలో విద్య, వైద్య రంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీరందించి రైతుల కలలు సాకారం చేస్తామని చెప్పారు. కేఎల్‌ఐ డీ-82 కాల్వ అసంపూర్తి పనులు సెప్టెంబర్‌లోగా పూర్తిచేసి 35వేల ఎకరాలకు సాగునీరందిస్తామని కసిరెడ్డి వివరించారు. డీసీసీబీ డైరెక్టర్‌ గంప వెంకటేశ్‌, మాజీ ఎంపీపీ లు కమ్లీమోత్యానాయక్‌, ఆనెవిజయ్‌, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌ రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు బీచ్యానాయక్‌, బాస్కర్‌రెడ్డి, హన్మనాయక్‌, చేగూరి వెంకటేశ్‌, గురిగళ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



దాతలకు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

సేవా పౌరులుగా గుర్తింపు పొందాలి

» ఎస్‌ఎల్‌బీలో డార్మిటరీ హాల్‌ ప్రారంభం

వికారాబాద్‌, జూలై 17: విద్యార్థులు ఉన్నత చదువు చదివి గొప్పస్థాయికి ఎదిగి సమాజ సేవాపౌరులుగా మారాలని పౌండేషన్‌ వ్యవస్థాపకులు డాక్టర్‌ బాలచంద్ర అన్నారు. ఫౌండేషన్‌, రాష్ట్ర గురుకుల సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన సంగం లక్ష్మీబాయి గురుకుల బాలికల కళాశాల డార్మిటరీ హాలు ప్రారంభోత్సవం బుధవారం నిర్వహించారు. దాతలు రీగల్‌ రెక్స్‌నార్డ్‌ ప్రతినిధులు అనిర్బపాల్‌, విజయ్‌కుమార్‌లకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దాతలు విద్యార్థినులకు చదువు ప్రాధాన్యం, సామాజిక సేవలపై వివరించారు. విద్యార్థినుల కూరాపాలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. డార్మిటరీ హాలు తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్‌ రమణమ్మ కృతజ్ఞతలు తెలిపారు. సిబ్బంది ఫౌండేషన్‌, రీగల్‌ రెక్స్‌నార్డ్‌ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్‌ రమణమ్మను దాతలు అభినందించారు. కార్యక్రమంలో లింగంపల్లి కళాశాల ప్రిన్సిపాల్‌ సురభి చైతన్య, పాఠశాల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీఆర్‌ఎస్‌కు లేదు

షాద్‌నగర్‌, జూలై 17: అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్‌ నాయకులు పనిగట్టుకుని కాంగ్రెస్‌ నాయకులపై విమర్శలు చేస్తున్నారని, వారికి విమర్శించే హక్కు లేదని కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు పి.రఘు, బాబర్‌ఖాన్‌, అగనూరు విశ్వంలు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లను విస్మరించిందని, వారికి రూ.రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయల రిటైర్మెంట్‌ బెనిఫిట్‌ ఇస్తామని మంత్రి సీతక్క ప్రకటించడం శుభపరిణామన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటిస్తుందన్నారు. రైతు రుణమాఫీకి ప్రభుత్వం శ్రీకారం చూడుతుందన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకులకు పనిలేక కాంగ్రెస్‌ ప్రభుత్వం విమర్శలు, ఆరోపణలు చేయడం పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. విమర్శలు, ఆరోపణలు మానుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నయ్య, బాలరాజ్‌గౌడ్‌, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహాయాదవ్‌, చంద్రశేఖర్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న చంద్రశేఖర్‌ ముదిరాజ్‌

బుర్ర జ్ఞానేశ్వర్‌కు నాయకుల శుభాకాంక్షలు

షాబాద్‌, జూలై 17 : రాష్ట్ర కో-ఆపరేటివ్‌ సొసైటీ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన బుర్ర జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ను బుధవారం నగరంలోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో కాంగ్రెస్‌ పార్టీ షాబాద్‌ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌ ముదిరాజ్‌, పార్టీ నాయకులు సంజీవరెడ్డి, సుభాష్‌రెడ్డి, శేఖర్‌, శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మద్‌ జానీ, కిషోర్‌నాయక్‌ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

లైట్లను ఆర్పేవారే లేరా?

» పగటి పూటా వెలుగుతున్న వీధిలైట్లు

పెద్దేముల్‌, జూలై 17 : గ్రామాల్లో వీధిలైట్లనే తెల్లవారి ఆర్పడం లేదు. వీధిలైట్లు పగలూ, రాత్రీ వెలుగుతూనే ఉన్నాయి. వాటికి గ్రామాల్లో ప్రత్యేక వైరింగ్‌, స్విచ్‌లను ఏర్పాటు చేశారు. కానీ ఆఫ్‌ చేయడం లేదు. దీంతో లైట్లను ఆర్పడంపై ఎవరూ పట్టించుకోవడం లేదు. కరెంటు వృథా అవుతోంది. అధికారులు స్పందించి పగటిపూట లైట్లను ఆర్పేసేలా చర్యలు తీసుకోవాలి.





గోవా రాష్ట్ర సహకార బ్యాంక్‌ కార్యాలయాన్ని సందర్శించిన ఉమ్మడి జిల్లా ప్యాక్స్‌ చైర్మన్లు

గోవా డీసీసీబీని సందర్శించిన ప్యాక్స్‌ చైర్మన్లు

దారూరు, జూలై 17 : స్టడీ టూర్‌లో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పీఏసీఎస్‌ చైర్మన్లు గోవా వెళ్లారు. డీసీసీబీ హైదరాబాద్‌ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన 42మంది సొసైటీల చైర్మన్లు బుధవారం గోవాలోని కో-ఆపరేటివ్‌ బ్యాంకును సందర్శించారు. అక్కడి అధికారులతో సమావేశమైనట్లు హరిదాసుపల్లి సొసైటీ చైర్మన్‌ వెంకటరెడ్డి తెలిపారు. బ్యాంకు అధికారులే ఇక్కడి రైతులకు పండించే వ్యవసాయ మార్కెటింగ్‌ చేస్తున్నారని ఆయన చెప్పారు. జీడిపప్పు వ్యాపారంతో బ్యాంక్‌ లాభాల బాటలో పయనిస్తోందని చెప్పారన్నారు. పంట రుణాలు, బంగారం తనఖా రుణాలను రైతులకు మంజూరు చేస్తుందని చైర్మన్‌ వివరించారు.

కేదార్‌నాథ్‌ నమూనా ఆలయ నిర్మాణం అభినందనీయం

మేడ్చల్‌ టౌన్‌, జూలై 17: ఉత్తర భారతదేశంలో ప్రసిద్ధ కేదార్‌నాథ్‌స్వామి ఆలయం వంటిదే ఎల్లంపేటలోనూ నిర్మించటం అభినందనీయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. బుధవారం ఎల్లంపేటలో నిర్మిస్తున్న కేదార్‌నాథ్‌ ఆలయానికి భూమిపూజలో ఎంపీ పాల్గొన్నారు. ఉత్తర భారతానికి వెళ్లలేని వారు ఇక్కడే స్వామివారిని దర్శించేభాగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కాశీ పీఠాధిపతి నరేంద్రనాథ్‌ సరస్వతి, కమలేసనంద్‌ దాస్‌, మణిరామ్‌దాస్‌ పూజలు నిర్వహించారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నాయకులు జగన్‌గౌడ్‌, దొడ్డమల్ల కార్తున్‌, అంజనేయులు ముదిరాజ్‌, జయపాల్‌సింగ్‌ పాల్గొన్నారు.



ఆలయ భూమి పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్‌

ట్రాఫిక్‌జామ్‌తో ఇబ్బందులు

» మేడ్చల్‌ వరకు జరుగుతున్న హైవే పనులు » ట్రాఫిక్‌ డైవర్షన్‌పై దృష్టి

» వాహనదారులు పట్టణం దాటేందుకు ప్రత్యామ్నాయ మార్గం

మేడ్చల్‌ టౌన్‌, జూలై 17:హైదరాబాద్‌ శివారు నుంచి చేపట్టిన జాతీయ రహదారి పనులు మేడ్చల్‌ వరకు సాగుతున్నాయి. పారిశ్రామికవాడ నుంచి బైపాస్‌ వరకు నిర్మిస్తున్న హైవే వంతెన పిల్లర్ల ఏర్పాటు పట్టణ శివార్లలో పూర్తయింది. ప్రస్తుతం ఆర్టీసీ కాలనీ నుంచి ఎన్జీవో కాలనీ వరకు రహదారి మధ్య పిల్లర్ల పనులు చేస్తున్నారు. దీంతో హైవేపై నిత్యం వాహనాలు కిక్కిరిసి కిలోమీటర్ల మేర జామ్‌ అవుతోంది. మేడ్చల్‌ శివారు వరకు ట్రాఫిక్‌ సాఫీగానే ఉన్నా పట్టణంలో అడుగు ముందుకు సాగని పరిస్థితి ఉంది. ముందు జాగ్రత్తగా అధికారులు మూడూ యూ టర్న్‌లను మూసేశారు. వివేకానంద చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్‌ ఎదురుగా ఉన్న యూటర్నులను కూడా భవిష్యత్తులో క్లోజ్‌ చేసి మరో చోట ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. 25 పిల్లర్ల కోసం రోడ్డు మధ్యలో తవ్వుతారు. పట్టణం నడిబొడ్డున రహదారి ఉన్నందున రోడ్డుకు ఇరువైపులా నివాసం ఉంటున్న వారు రోడ్డుదాటే క్రమంలో ప్రమాదాలు గురికాకుండా తాత్కాలిక యూటర్నులు ఏర్పాటుకు అధికారులు చర్చిస్తున్నారు.

చిన్న వాహనాల కోసం ప్రత్యామ్నాయ మార్గం

రహదారిపై వాహనాల జామ్‌ను అరికట్టేందుకు మొదట అధికారులు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. హెవీ వెహికిల్స్‌ మధ్య చిన్న వాహనదారులు ఇరుక్కోకుండా పెద్దచెరువు, తుమ్మ చెరువు కట్టల మీదుగా ప్రయాణం చేసేలా రోడ్డు సౌకర్యం కల్పిస్తారు. నగరం వైపు నుంచి మేడ్చల్‌ దాటి తూప్రాన్‌ వెళ్లే బైకులు, కార్లను చెక్‌పోస్టు నుంచి పెద్దచెరువు కట్ట మీదుగా కిష్టాపూర్‌ ఇంటి రాగానే చౌరస్తా, మహవీర్‌ చౌరస్తాల మీదుగా మళ్లిస్తారు. చెరువు కట్టపై నుంచి ముకుందరెడ్డి టర్‌ వద్దకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే తూప్రాన్‌ వైపు నుంచి వచ్చే చిన్న వాహనాలూ ఇదే దారి గుండా వెళ్లేలా చూస్తున్నారు. తుమ్మచెరువు కట్ట సామర్థ్యం అంతగా లేనందున బైక్‌లు, కార్లు మాత్రమే ఈ రోడ్డును వినియోగించుకునే వీలుంది.



యూ టర్న్‌ కోసం పరిశీలిస్తున్న ట్రాఫిక్‌ సీఐ హనుమాన్‌ గౌడ్‌



మేడ్చల్‌లో కొనసాగుతున్న రోడ్డు పనులు

ప్రమాదాల నియంత్రణకు..

పట్టణంలో రోడ్డు పనులు పూర్తయ్యేంత వరకు ప్రమాదాల నియంత్రణపై ట్రాఫిక్‌ పోలీసులు దృష్టి సారించారు. ట్రాఫిక్‌ సమస్యను అధిగమించేందుకు కఠినంగా వ్యవహరించనున్నారు. రోడ్డు దాటేందుకు యూటర్నులకు వేచుకోవటానికి కొందరు రాంగ్‌ రూట్‌లో పోయి ప్రమాదాలకు గురవుతున్నారు. రాంగ్‌ రూట్‌లో ప్రయాణించే వారు పట్టుబడితే జరిమానా మాత్రమే కాకుండా వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపుతామని హెచ్చరిస్తున్నారు. రోడ్డు పనుల నేపథ్యంలో ట్రాఫిక్‌ రూల్స్‌ను మరింత కచ్చితంగా అమలు చేస్తామని, ప్రజల ప్రాణాలే తమకు ముఖ్యం అని మేడ్చల్‌ ట్రాఫిక్‌ సీఐ హనుమాన్‌గౌడ్‌ అన్నారు.

బోడుప్పల్ మేయర్‌ను కలిసిన ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్

ఘట్‌కేసర్, జూలై17: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్ తోటకూర అజయ్‌ని ఆయన నివాసంలో ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్‌ను శాలువాతో సత్కరించారు. మేయర్‌ను కలిసిన వారిలో స్థానిక నాయకులు ముత్యాలు, రాదాకృష్ణ, నర్సింగ్‌రావు, సునిల్ తదితరులు ఉన్నారు.



మేయర్ అజయ్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముల్లిపావని

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఘట్‌కేసర్, జూలై 17: తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జరిపేటి జైపాల్‌ను ఘట్‌కేసర్‌కు చెందిన వరికుప్పల లింగస్వామి బుధవారం ఎంబీసీ కార్పొరేషన్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీలు ఆర్థికాభివృద్ధికి కృషిచేయాలని కోరినట్లు లింగస్వామి తెలిపారు, చైర్మన్‌ను కలిసిన వారిలో సత్యనారాయణ, వెంకటేష్, చంద్రయ్య, మల్లేష్, రవి ఉన్నారు.

నాగారంలో మొక్కల పంపిణీ

కీసర రూరల్, జులై 17: వన మహోత్సవంలో భారీగా మొక్కలు నాటాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఐదో వార్డు శ్రీనివాస్‌నగర్ కాలనీలో మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అందరూ బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. ఔషద, పూలు, పండ్లు తదితర మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు



వికారాబాద్: శివారెడ్డిపేటలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

తాండూరు రూరల్/పూడూరు/కీసర/వికారాబాద్/మేడ్చల్ టౌన్/ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్/కొడంగల్/ధారూరు/పరిగి/కులకచర్ల/శామీర్‌పేట, జూలై 17:వికాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పీర్లపండుగ వేడుకలు బుధవారంతో ముగిశాయి. తాండూరు మండలం ఎల్మకన్నె, బెల్కటూర్, ఉద్దండాపూర్, జినుగుర్తి, నారాయణపూర్, కరన్‌కోట్, బిజ్వార్, గోనూరు, చంద్రవంచ గ్రామాల్లో పీర్లను నిలిపి మూడు రోజుల పాటు వేడుక చేసుకున్నారు. మసీదుల్లో పీర్లకు మాలీజ నైవేద్యాలు సమర్పించారు. యువకులు అసాయ్.. దులా అంటూ చిందులేశారు. పూడూరు మండల గ్రామాల్లో చివరి రోజు సాయంత్రం వరకు పీర్ల ఊరేగింపు కొనసాగింది. కీసర, గోధుమకుంట, రాంపల్లి దాయర, కరీంగూడ, కీసర, దాయర, నర్సంపల్లి, భోగారం, యాద్గార్‌పల్లి, చీర్యాల్ గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. హిందువులు, ముస్లింలు పీర్లకు దట్టీలు, బెల్లం సమర్పించారు. కర్బలా యుద్ధంలో ప్రాణ త్యాగాలు చేసిన ఇమామ్ హుస్సేన్, హసన్‌లను తలచుకుంటూ షియా ముస్లింలు బ్లేడ్లతో, కత్తులతో ఛాతీపై కోసుకుంటూ(మాతం) రక్తం చిందించి తమ దేవుళ్లను స్మరించుకున్నారు. వికారాబాద్‌లో పీర్లంటిని శివారెడ్డిపేట వద్దకు తీసుకెళ్లి సాయంత్రం అక్కడ ప్రత్యేక వేడుకలను నిర్వహించారు.పీర్లను చూసేందుకు ప్రజలు శివారెడ్డిపేటకు పెద్దఎత్తున తరలి వచ్చారు. మేడ్చల్‌లోని మసీదుల్లో పీర్లకు 10రోజులు ప్రార్థనలు చేశారు. బుధవారం ఉదయం, సాయంత్రం పట్టణంలో ఊరేగించారు. సంతోషిమాత ఆలయం వద్ద గల పీర్ల మసీదు, కింది బస్తీ, కటిక బస్తీల్లో పండుగలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ముస్లింలు అన్నదానాలు నిర్వహించారు. ఆర్టీసీ డిపో వద్ద యువకులు షర్బత్ పంచారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో పీర్లను ఉరేగించారు. ఘట్‌కేసర్ మండలంలో మొహర్రంను కులమతాలకు అతీతంగా జరుపుకున్నారు. అవుశాపూర్, అంకుషాపూర్, మర్రిపల్లిగూడ, ఎదులాబాద్, ప్రతాప్‌సింగారం, కాచవానిసింగారం, కొర్రెముల, మాధారం గ్రామాల్లో పీర్లకు దట్టీలుకట్టి ప్రార్థనలు చేశారు. మొహర్రం ఉత్సవాలను కొడంగల్ నియోజకవర్గంలో ఘనంగాజరుపుకున్నారు. పీర్లకు ప్రార్థనలు నిర్వహించారు. బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దోమ, మోమిన్‌పేట్, నవాబుపేట మండల కేంద్రాలు, గ్రామాల్లో ఉత్సవాలను జరుపుకున్నారు. ధారూరు మండల గ్రామాల్లో మొహర్రం పండుగను జరుపుకున్నారు. కుక్కింద, కొండాపూర్‌కలాన్, తరిగోపుల, రుద్రారం, మోమిన్‌కుర్దు, మోమిన్‌క లాన్ గ్రామాల్లో మాలీజను సమర్పించి మొక్కుకున్నారు. మొహరం మత సామరస్యానికి ప్రతీక అని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. ఉత్సవాల్లో భాగంగా నిప్పుపై నడిచాడారు. హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా జరుపుకునే పండుగ మొహరం అని పేర్కొన్నారు. కులకచర్ల, బొంరెడ్డిపల్లి, పుట్టపహడ్, చౌడాపూర్, వీరాపూర్, ముక్త వెంకటాపూర్, మరికల్ గ్రామాల్లో పీర్లను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. శామీర్‌పేట, తూంకుంటల్లో మొహర్రం వేడుక జరుపుకున్నారు.



పరిగిలో పీర్ల ఉత్సవాల్లో నిప్పుపై నడుస్తున్న భక్తులు ◄



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చందుపట్లగూడలో పీర్ల ఉరేగింపులో పాల్గొన్న స్థానికులు



మేడ్చల్‌లో ప్రతిష్ఠించిన పీర్లు



పరిగిలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న మునిసిపల్ చైర్మన్ అశోక్,తదితరులు



కొడంగల్‌లో ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు



అన్నారంలో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

క్రైం కార్నర్

సాగర్ బ్యాక్ వాటర్‌లో మక్తా వాసి మృతి

● విహారయాత్రతో నెలకొన్న విషాదం



జగదీష్(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, జూలై 17 : పోచారం ఐటీసీ పోలీస్ స్టేషన్ పరిధి చౌదరిగూడ మక్తాకు చెందిన చింతపంటి జగదీష్‌యాదవ్(42) నాగార్జున్‌సాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి మృతిచెందాడు. జగదీష్, సురేష్‌నాయక్ మరో ముగ్గురు స్నేహితులు నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్, వైజాగ్ కాలనీకి మంగళవారం సాయంత్రం విహారయాత్రకు వెళ్లారు. బుధవారం తెల్లవారు జామున నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్‌లోకి స్నానానికి కోసం దిగిన జగదీష్ నీటమునిగి మృతిచెందాడు. జాలర్లు అతడిని వెలికి తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. జగదీష్‌యాదవ్ మృతిపై తమకు అనుమానాలున్నాయని కుటుంబసభ్యులన్నారు. జగదీష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

గ్యాస్ సిలిండర్ లీక్.. బాలికకు గాయాలు



సిలిండర్ నుంచి చెలరేగిన మంటలు

మూడుచింతలపల్లి, జూలై 17 : ప్రమాదవశాత్తు ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు లేచి ఓ బాలికకు గాయాలైన ఘటన శామీర్‌పేట్ పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మూడుచింతలపల్లి మండల పరిధి అద్రాస్‌పల్లిలో నారనికుమార్‌కు తన కూతురు ఉదయం టీ పెట్టి ఇచ్చేందుకు వంటింట్లో వెళ్లి గ్యాస్ స్టౌవ్ వెలిగించింది. ఒక్కసారిగా ఎల్పీజీ సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగి బాలికకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సాయంతో నీరు, ఇసుకతో మంటలను ఆర్పేశారు. గాయపడిన బాలికను ఆస్పత్రికి తరలించారు.

కరెంట్ షాక్‌తో ఎద్దు మృత్యువాత

బంట్వారం, జూలై 17: కరెంట్ షాక్ కొట్టి ఎద్దు మృతిచెందిన సంఘటన బంట్వారంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పాలెపల్లి వజీర్ పాషాకు చెందిన ఎద్దు బుధవారం ఉదయం మేతకు వెళ్లగా అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి చనిపోయింది. చనిపోయిన ఎద్దు విలువ రూ.75వేలు ఉంటుందని, ఎద్దు మృతితో నాగటికి ఎద్దు లేకుండా పోయిందని రైతు రోదిస్తూ తెలిపాడు. ప్రభుత్వం తనకు సాయం చేసి ఆదుకోవాలని కోరాడు.



కరెంట్‌షాక్‌తో మృతిచెందిన ఎద్దు

మద్యం దుకాణంలో అగ్ని ప్రమాదం

● రూ.28లక్షలపైగా నష్టం ● షార్ట్ సర్క్యూట్‌తోనే మంటలు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 17: మద్యం దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించి రూ.28లక్షలకుపైగా నష్టం వాటిల్లింది. అవుశాపూర్‌లోని శ్రీనిధి మద్యం దుకాణం మంగళవారం రాత్రి పదిగంటలకు మూసివెళ్లారు. అర్ధ రాత్రి దుకాణం నుంచి పొగలు రావడంతో స్థానికులు పోలీసులకు, షాప్ యజమానికి సమాచారం ఇచ్చారు. షాప్ నిర్వాహకులు, ఫైరింజన్, పోలీసులు మద్యం షాప్ వద్దకు చేరుకొని కరెంట్‌ను కట్‌చేశారు. దుకాణంలోని మద్యం సీసాలు, ఫ్రిడ్జ్‌లు, కౌంటర్ దగ్ధమయ్యాయి. బుధవారం ఉదయం ఎక్సైజ్ ఎస్‌ఐ నళిని ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్‌తోనే అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. దుకాణంలో రూ.60లక్షలకు పైగా మద్యం నిల్వ ఉందని చెప్పారు. మద్యంతో పాటు కౌంటర్‌లోని క్యాష్, సీసీ కెమెరాలు, హార్డ్ డిస్కులు, ఫ్రిడ్జ్‌లతో కలిసి మొత్తం రూ.28లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

● ఆటో డ్రైవర్ గంజాయి మత్తులో ఉన్నాడని పోలీసులకు ఫిర్యాదు



చెయ్యి విరిగిన శోభమ్మ

తాండూరు రూరల్, జూలై 17 : నడుచుకుంటూ వెళుతున్న మహిళను ఆటో ఢీ కొట్టింది. ఈ సంఘటన తాండూరు చౌరస్తాలో బుధవారం చోటుచేసుకుంది. అంతారం గ్రామానికి చెందిన మ్యాతరి శోభమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి అంతారం నుంచి ఆటోలో తాండూరుకు వచ్చింది. ఆటో దిగి వెళ్తుండగా, లోకల్ ఆటో నడిపించే యువకుడు శోభమ్మను ఢీకొట్టాడు. కుటుంబ సభ్యులు ఆమెను తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. శోభమ్మ చెయ్యి విరిగిందని, ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. బాధితురాలిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ రెఫర్‌కు చేశారు. ఆటో డ్రైవర్ గంజాయి మత్తులో ఉన్నాడని బాధితురాలి కుటుంబీకులు అతడిని పోలీసులకు అప్పగించారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



కొడంగల్: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

వికారాబాద్/మోమిన్‌పేట్/కొడంగల్/బషీరాబాద్/తాండూరు/శామీర్‌పేట, జూలై 17:ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వికారాబాద్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, అనంతగిరి పద్మనాభస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోమిన్‌పేట్ మండలంలోని విఠలేశ్వరాలయం, పులి లంకలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, రాళ్లగూడుపల్లి రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కొడంగల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వందలాదిగా భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అభిషేక మండపంలో విష్ణుమూర్తి చిత్రపటానికి అర్చకులు పూజలు నిర్వహించారు. హిందూ ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో విష్ణు సహస్ర పారాయణం నిర్వహించారు. బషీరాబాద్ హనుమాన్ ఆలయం నుంచి భజన మండలి ఆధ్వర్యంలో స్వామివారి పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ పూజారి జయరాంచారి నేతృత్వంలో కర్ణాటకలోని హల్కోడ గ్రామ పాండురంగ విఠల ఆలయం వరకు పల్లకిసేవ కొనసాగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తనయుడు ఎం.రోహిత్, నాయకులు సాయిల్‌గౌడ్, పవన్‌ఠాగూర్, రాజన్న పలువురు పాల్గొన్నారు. తాండూరులోని ఆలయాల్లో ఏకాదశి వేడుకలు నిర్వహించారు. మల్‌రెడ్డిపల్లి రోడ్డులోని పాండురంగస్వామి ఆలయంలో రుక్మిణి పాండురంగస్వామిలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల్లో మహిళలు సహస్రనామ పారాయణం పఠించారు. భద్రేశ్వర ఆలయం, పాత తాండూరు వేంకటేశ్వర, కోటేశ్వర, అయ్యప్ప స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. శామీర్‌పేట, తూంకుంట మున్సిపల్‌లో తొలిఏకాదశి వేడుకలను ప్రజలు అత్యంత ఆనందోత్సవాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. తొలిఏకాదశి ఉపవాస దీక్షను సాయంత్రం విరమించారు.



అనంతగిరి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్నభక్తులు



తాండూరు: పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో రుక్మిణీపాండురంగస్వామి

కొత్లాపూర్‌లో స్ట్రీట్‌లైట్ల ఏర్పాటు



బషీరాబాద్, జూలై 17: మండలంలోని కొత్లాపూర్ గ్రామ పంచాయతీలో విద్యుత్ స్తంబాలకు బుధవారం స్ట్రీట్‌లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. గ్రామంలో గత కొంత కాలంగా పలు వార్డుల్లో వీధిలైట్లు లేక రాత్రుల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ప్రత్యేకాధికారి, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు స్తంబాలకు వీధిలైట్లను అమర్చారు.

నూతన చైర్మన్లకు సన్మానం

శామీర్‌పేట, జులై 17: సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా పదవీ బాధ్యతలను చేపట్టిన రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లను బుధవారం శామీర్‌పేట రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు ముజీబుద్దీన్, పార్టీ ఇతర నాయకులు ఘనంగా సన్మానించారు.



సన్మానిస్తున్న నాయకులు ముజీబుద్దీన్, తదితరులు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు హరినాథ్‌నెహ్రూ

కొడంగల్, జూలై 17: లయన్స్‌క్లబ్ ఆఫ్ కొడంగల్ ఆధ్వర్యంలో మంగళవారం కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 35 మందికి ఆపరేషన్‌ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని కందూరి రాంరెడ్డి ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

పుట్టపహడ్‌లో వైద్య శిబిరం

కులకచర్ల, జూలై 17: కులకచర్ల మండలం పరిధిలో రోజురోజుకు డెంగ్యూ విజృంభిస్తుంది. ఇప్పటికే పుట్టపహడ్ గ్రామానికి చెందిన గీతాంజలి, కులకచర్లకు చెందిన నరేశ్‌లు డెంగ్యూ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్నారు. తాజాగా అంతారం గ్రామానికి చెందిన చంద్రమౌళి కుమారుడు చరణ్‌కు జ్వరం రావడంతో ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. చికిత్స నిమిత్తం పాలమూర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పుట్ట పహడ్ గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతున్నట్లు సీహెచ్‌వో చంద్రప్రకాశ్ తెలిపారు. జ్వరం వచ్చిన వారు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

ఘనంగా పండుగల సాయన్న జయంతి వేడుకలు



పరిగిలో పండుగల సాయన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి/దోమ/ఘట్‌కేసర్ రూరల్/కులకచర్ల/తాండూరు, జూలై 17 : తెలంగాణ రాబిన్ హుడ్ పండుగల సాయన్నముదిరాజ్ జయంతిని పరిగిలో జరుపుకున్నారు. సాయన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, మెపా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బి.జగన్మోహన్, ముదిరాజ్ సంఘం పరిగి తాలూకా అధ్యక్షుడు టి.రామస్వామి మాట్లాడుతూ.. భూస్వాముల పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని సాయన్న అని అన్నారు. ఆయన పేదల పెన్నిధిగా నిలిచారన్నారు. సాయన్న ఆశయసాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జాతీయ కార్యదర్శి కె.హన్మంత్, రాష్ట్ర కార్యదర్శి ఎం.నాగేశ్వర్, రామన్న, ఎంఈవో హరిశ్చందర్, లాయర్ ఆనంద్‌గౌడ్, రామకృష్ణ, కృష్ణ, శ్రీశైలం, పి.బాబయ్య, శివకుమార్ పాల్గొన్నారు. దోమ, గ్రామా ల్లో పండుగల సాయన్న జయంతిని నిర్వహించారు. రజాకార్ల రాజ్యంలో ఉన్నోళ్ల దగ్గర దోచి పేదలకు పంచిపెట్టిన గొప్ప వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు లక్ష్మయ్య, నర్సిములు, చందు, సంజీవ్‌కుమార్, అనంతయ్య, గోవర్ధన్, చంద్రశేఖర్, రాము, యాదయ్య, సంజీవ్, శ్రీనివాస్, గణేశ్, వెంకట్రాములు, బుగ్గయ్య, నర్సింలు, జనార్ధన్, అంజిలయ్య పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌లో సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ నిజాంను ఎదురించిన ధీరుడు సాయన్న అన్నారు. సొంత పాలన వ్యవస్థను ఏర్పాటు చేసి పరికొత్త బహుజన రాజ్యాంగాన్ని స్థాపించిన ధీశాలన్నారు. ఆయన ఆశయసాధనకై ముదిరాజ్‌లు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రధానకార్యదర్శి గేటు నవీన్, కార్యదర్శి చిలక గణేష్, శ్రీను, ఉపేందర్, అరుణ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. కులకచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాలతో పాటు మరికల్, వీరంపల్లి గ్రామాల్లో పండగల సాయన్న జయంతి వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయన్న పోరాట పటిమ, వీరత్వం, తెలంగాణ నిరుపేదలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కులకచర్లలోలో ముదిరాజ్ సంఘం నాయకులు అంజిల య్య, చంద్రలింగం, షైపాల్, ఆనందం, నర్సింలు, కర్ణ, చౌడాపూర్‌లో రమేశ్, యాదయ్య, రాములు, మరికల్‌లో నర్సింహారెడ్డి, శివకుమార్, సత్యకుమార్, నరేంద్రప్రసాద్, నర్సింలు, కృష్ణచారి, మొహ్మద్ అలీ, శివయ్య, శ్రీకాంత్, చిన్న, మహేశ్, శ్రీను, అంజయ్య పాల్గొన్నారు. తాండూరు ప్రాంతంలో పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. బహుజన సమాజ్ పార్టీ తాండూరు నియోజకవర్గ ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో జయంతి చేపట్టారు. కాళికాదేవి ఆలయం వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. సాయన్న జయంతిని ప్రభుత్వమే జరిపించాలని నాయకులు, నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు దొరిశెట్టి సత్యమూర్తి, నాయకులు బాలరాజ్ , క్రాంతి, కృష్ణయ్య గౌడ్, ప్రవీణ్ కుమార్, బాబు, ముదిరాజ్ సంఘం ఇజిల్లా అధ్యక్షులు లొంక నర్సిములు, నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్పీ రవి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి రాములు, కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, బంటు వేణు, జంగం నర్సిములు, ఇందూర్ వెంకట్, డాన్స్ మాస్టర్ రమేష్, యువజన సంఘం అధ్యక్షులు రాములు, జగదీష్, అమ్రేష్, బాతుల నాగు, బాతుల భీమ్ పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీహరి మృతి



శ్రీహరి(ఫైల్)

వికారాబాద్, జూలై 17: వికారాబాద్‌లోని జడ్పీ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాలి శ్రీహరి మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రెండు రోజుల కిందట తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. కుమారుడు కెనడా నుంచి వచ్చిన తరువాత శుక్రవారం శ్రీహరి అంత్యక్రియలు జరిగే అవకాశం ఉందని తెలిసింది. హెచ్‌ఎం గాలి శ్రీహరి మృతి పట్ల పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడియాల చంద్రశేఖర్, దోమ అమర్‌నాథ్ సంతాపం వ్యక్తం చేశారు.

నేడు రుణమాఫీ సంబరాలు

బొంరాస్‌పేట్, జూలై 17: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు రుణమాఫీ అమలుతో గురువారం బొంరాస్‌పేట్, దుద్యాల మండల కేంద్రాల్లో సంబరాలు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షులు నర్సిములుగౌడ్, అవుటి శేఖర్ బుధవారం పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని భూ లక్ష్మమ్మ చౌరస్తా, దుద్యాల చౌరస్తాలో నిర్వహించే కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.


పూడూరు: పూడూరు రైతు వేదికలో లక్ష రుణమాఫీ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఏవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతువేదికలో వీక్షించవచ్చని, రైతులతో సంబరాలు జరుపుకోనున్నట్లు చెప్పారు.

కొడంగల్/బొంరాస్‌పేట్: కొడంగల్ నియోజకవర్గంలోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడనున్నట్లు వ్యవసాయ శాఖ కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్ పేర్కొన్నారు. 3గంటలకు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు.

యాలాల: యాలాలలో రైతు రుణమాఫీ సంబరాలు జరుపుకుంటామని రాస్నం ఏఈఓ శిరీష తెలిపారు. సాయంత్రం 4గంటలకు జరిగే రుణమాఫీ సంబరాల్లో రైతులు పాల్గొనాలని కోరారు.

ధారూరు: మండలంలో 1,766 మంది రైతులకు రూ.లక్ష రుణమాఫీ వర్తిస్తుందని ఏవో ఝాన్సీలక్ష్మి తెలిపారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసిన తర్వాత బ్యాంకు అధికారులు రైతుల అంగీకారంతోనే వారి రుణ ఖాతాల్లో జమ చేసుకోవాలని ఆమె వివరించారు.

నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కులు పంపిణీ చేస్తున్న శంకర్‌యాదవ్

మోమిన్‌పేట్, జూలై 17: అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో 12మందికి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరోత్తంరెడ్డి, సుభాష్‌గౌడ్, మానెయ్య, ఎజాజ్, బాగ్దాద్, సురేందర్, హెరాజ్, బాల్‌రెడ్డి, పోచయ్య రవి, నర్సింలు, హజీ, తాజ్, మోసిన్, బాబ, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

మైలారం గుడికి భక్తుల పాదయాత్ర



కామునిపల్లి నుంచి మైలారానికి పాదయాత్ర చేస్తున్న భక్తులు

కులకచర్ల, జూలై 17: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం కులకచర్ల మండలంలోని కామునిపల్లి గ్రామం నుంచి దోమ మండలం మైలారం శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గత రెండు సంవత్సరాలుగా కామునిపల్లి గ్రామ ప్రజలు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపవాస దీక్షతో వెళ్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటామని వారు తెలిపారు.

నల్సర్‌లో నేడు వన మహోత్సవం

శామీర్‌పేట, జులై 17 : శామీర్‌పేటలోని నల్సర్ న్యాయవిశ్వ విద్యాలయ ఆవరణలో 18న గురువారం ఉదయం 11గంటలకు వైస్‌చాన్స్‌లర్ శ్రీక్రిష్ణదేవరావు ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ విద్యుల్లతరెడ్డి బుధవారం తెలిపారు. ఈ వనమహోత్సవం కార్యక్రమంలో విద్యార్థులతో పెద్ద ఎత్తున మొక్కలను నాటనున్నట్లు రిజిస్ట్రార్ వెల్లడించారు.

ఎల్లమ్మ అమ్మవారికి మకర తోరణం

శామీర్‌పేట, జులై 17: ఎల్లమ్మ ఆలయంలో దాత ముందుకు వచ్చి మకర తోరణం ఏర్పాటు చేశారు. శామీర్‌పేట మండల కేంద్రం మల్లన్న దేవాలయం వెనక ఉన్న ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి శామీర్‌పేటకు చెందిన డీజీ వెంకటేశ్‌గౌడ్ మకర తోరణాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మకర తోరణం అలంకరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, గ్రామస్తులు రాకేష్, నరేష్, మహేష్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ ఆలయంలో మకర తోరణం అలంకరించిన దాత డీజీ వెంకటేశ్‌గౌడ్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్ టౌన్, జూలై 17: మేడ్చల్ పట్టణం కిష్టాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కమర్షియల్, డొమస్టిక్, ఇండస్ట్రియల్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచి పోతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.